
# నా పాట నేనే

రఘుబాబు

కారు వచ్చి నేచురల్ స్కూలు ముందు ఆగింది. భుజానికి ఒక షోల్డర్ బ్యాగు తగిలించుకుని కిరణ్ కారులోంచి దిగాడు. అతని సూట్‌కేస్ పట్టుకుని డ్రైవర్ అతనికి దారి చూపిస్తూ ముందు నడిచాడు. కిరణ్ ఒక పాపులర్ రైటర్. యూనివర్శిటీలో ప్రొఫెసర్.

చింతచెట్టు కింద పిల్లలకు పాఠాలు చెప్తున్నాడు ముకుంద్. కిరణ్‌ను చూసి, క్లాసు ఆపేసి, ఆయనకు ఎదురు వచ్చాడు. స్కూలు పిల్లలందరికీ ఈ వార్త తెలిసింది. అందరూ పరిగెత్తుకుంటూ వచ్చేశారు. కిరణ్ చుట్టూ మూగి ఆయనకు స్వాగతం పలికారు. ప్రతి విద్యార్థీ కిరణ్ చేతిని స్పర్శించి, నవ్వుతూ తమల్ని పరిచయం చేసుకున్నాడు. ఆయన రాక తమకు కొత్త ఉత్తేజాన్నిస్తున్నదని వెల్లడించారు. కిరణ్‌ను గెస్ట్ రూమ్‌కు తీసుకువెళ్లి వదిలారు. ప్రయాణ బడలిక తీర్చుకున్నాక, ఆయన్ని తీసుకుని స్కూలు చూపించడానికి బయలుదేరాడు ముకుంద్. ఆ స్కూల్ నిర్వహించేది ముకుందే.




అయిదెకరాల తోట. చెట్ల మధ్య అక్కడక్కడా దూరం దూరంగా వేసిన గుడిసెలు. అవి క్లాసురూములు. తోటకు చివరగా పెద్ద ఇల్లు. అది ముకుంద్ ఇల్లు. దానికి ఆనుకుని టీచర్ల క్వార్టర్లు. క్లాసురూములకు దగ్గరగా విశాలమైన గుండ్రని పెద్ద పాక ఒకటి వుంది. అది అసెంబ్లీ హాలు. తోటలో ఒక మూల ల్యాబొరేటరీ. మరో మూల లైబ్రరీ. అన్ని గుడిసెల చుట్టూ రకరకాల పూలమొక్కలు ఒక క్లాస్‌రూమ్ నుంచీ మరో క్లాస్‌రూమ్‌కి వెళ్లడానికి చక్కని సన్నని మట్టిరోడ్లు. ఆ రోడ్లకి ఇరుపక్కలా పూల మొక్కలు. క్వార్టర్స్ దగ్గరగా కిచెన్ గార్డెన్. అది నిజంగా నేచురల్ స్కూలే. అక్కడి ప్రతి మొక్కనూ ఎంతో అందంగా, ఆప్యాయంగా పెంచుతున్నట్లు కన్పిస్తుంది. ఆవరణ మొత్తం ఎంతో శుభ్రంగా సుందరంగా నేర్చుకునే వాతావరణాన్ని ఏర్పరుస్తూ... విద్యా సంస్థ అంటే ఇలాగే వుండాలి అనే అభిప్రాయాన్ని కల్పిస్తోంది. మామిడి, చింత చెట్లకింద క్లాసులు జరుగుతున్నాయి.

ముందు స్కూలు ఆఫీసు, లైబ్రరీ, ల్యాబొరేటరీ చూపించాడు ముకుంద్. తర్వాత క్లాసురూముల్ని చూపించాడు. ప్రతి క్లాసురూమూ ఆ క్లాసు పిల్లలు వేసిన బొమ్మల్తోనూ, పిల్లలు రాసిన గేయాలూ, కథలతోనూ, పిల్లలు చేసిన మట్టి, కాగితం బొమ్మల్తోనూ అలంకరించి వుంది. ప్రతి క్లాసురూములోనూ లైబ్రరీ కూడా వుంది.

ఒకటో తరగతి నుంచీ పదో తరగతి వరకూ ఓ యాభైమంది పిల్లలదాకా చదువుకుంటున్నారు. ప్రయివేట్‌గా ఇంటర్, డిగ్రీ చదువుకుంటున్న విద్యార్థులు మరికొందరున్నారు. టౌనుకెళ్లి కాలేజీల్లో చదువుకునే పిల్లలు శని, ఆదివారాల్లో ఇక్కడకు వచ్చి చదువుకుని వెళ్తుంటారు.

పెద్ద క్లాసులలో డిస్‌ప్లే బోర్డులపై అలంకరించిన విద్యార్థుల రచనలు చదివి కిరణ్ స్థాణువై పోయాడు. ఆ రచనల్లో భావావేశం ఎక్కువగా కన్పిస్తోంది. కొన్నిచోట్ల పిల్లలు వ్యక్తం చేసిన భావాలు పెద్ద రచయితల స్థాయికేం తీసిపోవని పించింది. చెయ్యి తిరిగిన రచయితల్లాగా లయనూ, చంధస్సునూ, సౌష్టవాన్నీ పట్టుకోలేక

పోవచ్చు కానీ, నిరలంకారమైన పిల్లల అభివ్యక్తి హృదయాన్ని స్పృశించి చిన్నాభిన్నం చేస్తున్నది.

లైబ్రరీలో స్కూలు పిల్లలు రాసిన కథల పుస్తకాలూ, చిన్న నవలలూ, కవితల పుస్తకాలూ, వ్యాసాల పుస్తకాలూ చూపించాడు ముకుంద్. స్కూలు పిల్లలకేం సాహిత్యాభిరుచి వుంటుంది, వాళ్లకేం సాహిత్యం తెలుసుంటుందని అనుకున్నాడు కానీ, ఈ స్కూలు పిల్లలు అసాధ్యులుగానే కన్పిస్తున్నారు. అన్ని సాహిత్య ప్రక్రియల్లోనూ వాళ్లకి చక్కని శిక్షణ అందుతున్నట్లు కన్పిస్తున్నది. ఏవో కొన్ని జానపద కథలూ, పిట్టకథలూ చెప్పేసి సరదాగా రెండు రోజులు పిల్లల్తో గడపాలనుకున్నాడుగానీ, తీరా చూస్తే ఈ పిల్లల స్టాండర్డు బాగానే ఉన్నట్లుంది. ఈ పిల్లలు జీవితాన్ని పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. జీవితంలోని వ్యధనీ, కన్నీళ్లనీ, భ్రమల్నీ, ఆశల్నీ, సంఘర్షణనీ వ్యక్తీకరించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు..

ముకుంద్ కిరణ్‌కు స్కూలంతా చూపించేసరికి సాయంత్రమైంది. సాయంత్రం ఆటల పీరియడ్‌ను రద్దుచేసి పిల్లలందరూ అసెంబ్లీ హాలులో సమావేశమైనారు. ముకుంద్ కిరణ్‌ను పిల్లలకు పరిచయం చేశాడు. ఆయన వృత్తి ఉద్యోగాలు, పదవులు, ఆయన చేసిన రచనలూ, పొందిన అవార్డులూ, ఇటీవల అవార్డు పొందిన పుస్తకం గురించీ వివరించాడు.

పిల్లలకు సందేశం, ఉపదేశం ఇవ్వటం తన కర్తవ్యమన్నట్లు కిరణ్ తన ఉపన్యాసాన్ని ప్రారంభించాడు. కథల్ని ఎలా ఊహించాలి, జనాకర్షకంగా కథలు రాయాలంటే సన్నివేశాల్ని ఎలా కల్పించుకోవాలి, పాఠకుల్లో ఆసక్తి, ఉత్కంఠ కలిగించేలా ఎలా ముగింపు వుండాలి... అన్నవి వివరిస్తూ తానెలా ఉత్కంఠపరిచేలా కథలు రాస్తాడో సోదాహరణంగా తెలియజేశాడు. జనాకర్షకంగా కథలు రాయకపోతే రచయితను ఎవరూ పట్టించుకోరు అని హెచ్చరించాడు.

రెండోరోజు ఉదయం కిరణ్ పెద్ద తరగతుల పిల్లలతో గడిపాడు. పిల్లలు స్వతహాగా తమ సందేహాల గనుల్నుండీ ప్రశ్నిస్తున్నారు. అతని రచనల్లోని వర్ణనల గురించీ, సంభాషణల గురించీ, పాత్రల్ని ఎంచుకోవడం గురించీ, వాళ్లు ప్రశ్నిస్తున్నారు.. వాళ్లు రాసిన కొన్ని రచనలు తెచ్చి చూపించారు. వాటిని సరిచేయమని చాలా వినయంగా వేడుకున్నారు. వాళ్లు రాసిన వాటిల్లో ఉత్కంఠ లేకపోవచ్చు. అద్భుతమైన ముగింపులు లేకపోవచ్చు. కానీ జీవితాన్ని వడపోయాలనే ప్రయత్నం కనిపిస్తున్నది. వారి వారి జీవితాలు వారి వారి రచనల్లో ప్రతిబింబిస్తున్నాయి. జీవితంలోని మరోవైపు గురించి వాళ్లకిన్నాళ్లూ ఎలా తెలీదో, తనకి తెలిసినా తాను నిర్లక్ష్యం చేసిన ఈ వైపు గురించి ఈ పిల్లలు తనకు తెలియజేస్తున్నట్లుంది.. తన్ను హెచ్చరిస్తున్నట్లుంది.. అందుకే ముకుంద్ తన్నిక్కడికి ఆహ్వానించాడా?

కిరణ్ తనకు అవార్డు వచ్చిన పుస్తకం గురించి ఒకసారి ఆలోచించాడు. నిజానికి ఆ పుస్తకంలో ఏముంది? తనూ జీవితపు సన్నివేశాల్ని అద్భుతంగా వడగట్టగలనని ఆ పుస్తకం రాశాడు. నిజంగానే అద్భుత రసాన్ని ఒలికించిన రచన అది. ఆలోచనలకు పదునుపెడ్తూ, పత్రికల్లో పడిన సమాచారాన్ని ఒక మాలగా కట్టి. తనకంటూ ఏ అనుభవమూ లేదు. ఏ అనుభూతీ లేదు. తన పలుకుబడీ, అధికారాన్ని ఉపయోగించి అవార్డు తెప్పించుకున్నాడు. పత్రికల్లో సమీక్షలు రాయించుకున్నాడు. గోష్ఠులు ఏర్పాటు చేయించుకున్నాడు..



**ఆ రచనల్లో భావావేశం ఎక్కువగా కన్పిస్తోంది. కొన్నిచోట్ల పిల్లలు వ్యక్తం చేసిన భావాలు పెద్ద రచయితల స్థాయికేం తీసిపోవనిపించింది. చెయ్యి తిరిగిన రచయితల్లాగా లయనూ, చంధస్సునూ, సౌష్టవాన్నీ పట్టుకోలేకపోవచ్చు కానీ, నిరలంకారమైన పిల్లల అభివ్యక్తి హృదయాన్ని స్పర్శించి చిన్నాభిన్నం చేస్తున్నది.**

ఫలితం తనకున్న గుర్తింపు మరింత బలపడింది.

కిరణ్ మొట్టమొదటి సారిగా తన గురించి ఆలోచించుకున్నాడు. తన గురించి తర్కించుకున్నాడు.

నా దృక్పథం వేరు, నా రచన తీరే వేరు. నా లక్ష్యమే వేరు. ఆ పద్ధతే వేరు.. అని ఎంత సర్దిచెప్పుకుందామనుకున్నా ఈ బడిలో, ఈ పిల్లల మధ్య, ఈ ప్రాకృతిక వాతావరణం మధ్య, ఈ సాహిత్య చర్చల మధ్య.. తాను యూనివర్శిటీ విద్యార్థులతో చేయలేనిది, ఇక్కడ ఈ మారుమూల, స్కూలు పిల్లల్తో ముకుంద్ సృజన చేయిస్తున్నాడు. ఇక్కడ తన్నెవరూ చిన్నపుచ్చాలనుకోవడం లేదు. ఇక్కడ తన్నెవరూ అవమానించాలనుకోవడం లేదు. ఇక్కడ తనకెవరూ జీవిత పాఠాలను కానీ, నీతి సూత్రాలనుకానీ నేర్పాలనుకోవటం లేదు.. కానీ ఏదో చిన్నతనంగా అనిపిస్తోంది.

మధ్యాహ్న భోజనాలప్పుడు ముకుంద్ వినయంగా అన్నాడు.. ''ఈ బడిని మేమే స్థాపించి నడుపుతున్నామనుకోండి.. కానీ ఇక్కడి అధికారమంతా పిల్లలదే. మేము కేవలం పాఠాల్ని వివరించే వాళ్ళం మాత్రమే. మా పిల్లలు మీరొచ్చినందుకు గుర్తుగా కొన్ని పాటలు రాసి మీకు బహూకరించాలనుకుంటున్నారు. మీ రాక వాళ్లకు ఒక కొత్త దృష్టినీ, కొత్త దృక్పథాన్ని ఇచ్చింది''

కిరణ్ కూడా పిల్లల సృజనశక్తిని పరిశీలించాలనుకున్నాడు. భోజనాలు అయిపోయిన తర్వాత, పిల్లలందరూ ముక్తకంఠంతో రాస్తామన్నారు.

ముకుంద్, కిరణ్ వైపు తిరిగి ''పిల్లల్ని రాయండర్రా అంటే రాయలేరు. వాళ్లు రచన చేయాలంటే అందుకు తగిన వాతావరణాన్ని ఏర్పరచాల్సి వుంటుంది. అదో బృహత్ ప్రయత్నం..'' అని పిల్లలకేసి తిరిగి, ''మీరు కొన్ని పాటలు రాస్తారు. అయితే ముందు నేనొక కథ చెపుతాను. జాగ్రత్తగా వినండి'' అనంటూ కథను ప్రారంభించాడు.

''ఒక ఎలుగుబంటి ఒక మహిమగల పిల్లంగోవిని సంపాదించింది. దాన్ని అడవిలోని జంతువులకు చూపించి ' ఎవరైనా తన పాటలోని మొదటి చరణాన్ని ఈ పిల్లంగోవిలో ఊదితే చాలు, మిగిలిన పాటంతా పిల్లంగోవే పాడేస్తుంది' అని చెప్పి, ముందుగా తన పాట మొదటి చరణాన్ని పాడింది పిల్లంగోవిలో. అంతే మిగిలిన పాటనంతా అదే పాడేసింది. జంతువులకు ఆశ్చర్యమైంది. అన్నీ తమ పాటల్ని పాడుతామన్నాయి. 'మీరూ పాడవచ్చు, కానీ ముందు మీ నిజమైన పాటలేవో కనుక్కోండి. అప్పుడు ఊదితేనే ఇది పాడుతుంది' చాలాసేపు ప్రయత్నించి జంతువులు తమ పాటల్ని కనుక్కొచ్చి పాడాయి. ఆ పిల్లంగోవి వాళ్ల పాటల్ని పాడి వినిపించింది. చిట్టి కుందేలుకు తన పాటేదో అర్థం కాలేదు. అందుచేత అది దొంగలా వచ్చి పిల్లంగోవిని తీసుకుని వాయించింది. అంతే భయంకరమైన పాటని ఆ పిల్లంగోవి పాడింది. భూకంపం పుట్టింది. కుందేలుకు భయం వేసింది. ఎలుగుబంటి పరుగున వచ్చి పిల్లంగోవిలో తన పాటని ఊదింది. అంతే మళ్లీ అంతా కుదుటపడింది. అప్పుడు ఎలుగుబంటి కుందేలుతో 'నీ పాటను తెలుసుకో. అప్పుడొచ్చి పాడు' అంది. చిట్టి కుందేలు ఎన్నో రాత్రులూ, పగళ్లూ గడిపింది తన పాటేదో తెలుసుకోవాలని. చివరికి ఓ ఉషోదయాన దానికి తన పాటేదో తెలిసింది. వెళ్లి పిల్లంగోవిలో తన పాటను ఊదింది. ఇక పిల్లంగోవి అంతా పాటను పాడింది. అందరూ ఆ పాటతో గొంతు కలిపారు. అది అందరి పాటయిపోయింది''

ముకుంద్ కాసేపు ఆగి మళ్లీ అన్నాడు ''మనలో ప్రతి ఒక్కరికీ ఒక పాట వుంటుంది. మనం ఆ పాటల్ని నిర్లక్ష్యం చేస్తుంటాం. చాలామంది ఆ పాటల్ని పోగొట్టుకున్నారు. ఎవరైతే ఆ పాటల్ని జీవితాంతం తమ వెంటే ఉంచుకుంటారో వాళ్లు కష్టాల్నయినా, బాధల్నయినా, సంతోషాల్నయినా సమంగా అనుభవించగలుగుతారు. మీ అందరికీ కూడా ఒక పాట వుంటుంది. మీ పాటల్ని మీరు కనుక్కురండి. మనసు లోపల దాక్కున్న మీ పాటల్ని బయటకు తీయండి. ఆ పాట మీ హృదయంలోంచీ రావాలి. మీ కన్నీళ్ల నుంచీ, మీ దారిద్ర్యం నుంచీ, మీ స్వార్థ మనస్తత్వాల నుంచీ

పెల్లుబికి రావాలి. స్వచ్ఛంగా, నిర్మలంగా, నిరలంకారంగా బయటకు రావాలి''

పిల్లల్లో కొందరు మౌనంగా లేచిపోతుంటే, కొందరు అల్లరి చేసుకుంటూ వెళ్లిపోయారు. కొందరు చెట్లకింద, కొందరు చెట్లెక్కి కొమ్మల మధ్య కూర్చున్నారు. కొందరు లైబ్రరీలో పుస్తకాల మధ్య కూర్చున్నారు. కొందరు జంటలుగా ఏర్పడి, కబుర్లు చెప్పుకుంటూ తమ పాటలు ఏమై వుంటాయో తర్కించుకోసాగారు. చెట్ల గలగలల మధ్య, పక్షుల కలరవాల మధ్య, పుస్తకాల పంక్తుల మధ్య.. ఆ ప్రశాంత గంభీర వాతావరణంలో ప్రతి ఒక్కరి మనసూ తమ పాటేదో కనుక్కునే దిశగా పయనిస్తోంది.

సాయంత్రం మళ్లీ అసెంబ్లీ సమావేశమైంది. తమ పాటల్ని పట్టుకొచ్చిన వాళ్లు పెద్దగా చదవటం ప్రారంభించారు. కొందరు తమ పాటలు పువ్వులన్నారు. కొందరు చిలకలన్నారు. కొందరు తమ పాట తమ ముద్దులొలికే చెల్లాయన్నారు. కొందరు తమ పాట తాము చేసే పనేనన్నారు. కొందరి పాటల్లో వాళ్ల బాధలు వ్యక్తమయ్యాయి. కొందరి పాటల్లో ఆహ్లాదంగా ఉండే వారి స్వభావం వ్యక్తమైంది. కొందరి పాటల్లో వారి వారి ఇష్టాయిష్టాలు వక్తమయ్యాయి. ముకుంద్ కొందరి పాటల్లోని పదాల్ని, కొన్ని వాక్యాల్నీ మార్పు చేసాడు. ఆ మార్పుల వల్ల ఆ పాటలకు మరింత లోతు, గాంభీర్యతా చేకూరాయి.

కిరణ్‌కు అదొక అపూర్వమైన సన్నివేశం. సాహిత్య బోధన అంటే తాము లెక్చరిస్తాం కానీ, హృదయగతమైన ఒక భావనతో, ఒక అనుభూతితో సృజించటం తమకు చేతకాదు. సాహిత్య బోధన అంటే ఆలోచనల్ని భాషలో కూర్చటమే అనే అభిప్రాయమే తమది. సృజనాత్మకత గురించి ఉపన్యసిస్తారుగానీ, సృజనాత్మకతను కలిగి వుండటాన్ని విద్యార్థులకు నేర్పించలేరు. చిన్న కథ పిల్లల్ని ఎలా అంతర్ముఖుల్ని చేసింది. వారి వారి హృదయాల్ని తట్టి పాటల్ని చదువుతున్నారు. నిత్యం తమ వెంట వుండే పాటల్ని ఆలపిస్తున్నారు.

తన పాటేమిటి? కిరణ్ తన్ను తాను ప్రశ్నించుకున్నాడు. తన హృదయ గవాక్షాన్ని మొదటిసారిగా తట్టాడు. తన పాట తనలోంచీ ఎప్పుడో అదృశ్యమైంది. తాను ఒంటరిగా ఉన్నప్పుడో, తను నిద్రపోతున్నప్పుడో ఆ పాట తన్ను హెచ్చరించడానికి వచ్చినా, తాను దాని గొంతు నొక్కేసి తరిమేసేవాడు. ఇప్పుడు తన పాట ఎక్కడుందో...

తన పాట పువ్వులా? చిలుకలా? ముద్దులొలికే చెల్లాయిలా? సుందర కన్యలా? తన భార్యనా? తన కూతురు సాహిత్యనా? తన పాట తన ఉద్యోగమా? పేరు ప్రతిష్టలా?

తన పాట ఏది?

తనకూ పాట వుందా?

తన మనసు పాట ఏమిటి?

ఆయన కూడా తన పాటను వెదుక్కునే సందిగ్ధస్థితిలో పడిపోయాడు. అతనికి తెలీకుండానే అతని కళ్లు చెమర్చాయి. ''బుజ్జీ! నువ్వు నీ పాటను పట్టుకురాలేదా?'' ముకుంద్ బుజ్జిని ప్రశ్నించాడు.

ఎనిమిదో తరగతి చదువుతున్న బుజ్జి సమాధానం చెప్పలేదు. బుజ్జి అంటే ముకుంద్‌కు ప్రత్యేకమైన అభిమానం.

''ఏరా! నిన్నే అడిగేది''

''నాకు పాట లేదన్నా'' బుజ్జి సన్నగా చెప్పాడు.

ముకుంద్ ఆశ్చర్యంగా మౌనాన్ని దాల్చాడు.

''నాకు పాటే లేదన్నా. పాటే వుంటే ఎప్పుడో, అందరికన్నా ముందే పట్టుకొచ్చేవాడ్ని..'' అన్నాడు బుజ్జి అమాయకంగా.

ముకుంద్ నచ్చచెప్తున్న ధోరణితో అన్నాడు. ''ప్రతి ఒక్కరికీ ఒక పాట వుంటుంది. పాటలేని వాళ్లెవ్వళ్లూ వుండరు. ఆ పాటే లేకపోతే జీవితం ఎంతో నిస్సారమవుతుంది. నా పాటేదో మీకు తెలుసుగా.. పిల్లలు, పిల్లలు నా పాట. నా పాటే నా జీవితం. ఆ పాట నన్నావరించి ఉండకపోతే నేనింతకాలం బతకటం సాధ్యమయ్యేదా? నీకూ ఒక పాట

**''నాకు పాటే లేదన్నా. పాటే వుంటే ఎప్పుడో, అందరికన్నా ముందే పట్టుకొచ్చేవాడ్ని..''**



వుంటుంది. తప్పకుండా వుంటుంది. కిరణ్ అన్న రేపు ఉదయం వెళ్లిపోవాలి. కానీ నీ పాట వినకుండా ఎట్లా వెళ్తాడు? పోనీ రేపు ఉదయానికి పట్టుకురా''

క్వార్టర్స్‌కు తిరిగి వచ్చిన తర్వాత, ముకుంద్ కిరణ్‌ను అభ్యర్థిస్తూ ''వాడు కాస్తంత సోమరి. వాడు తప్పకుండా తన్ను తాను వ్యక్తీకరించుకుంటాడు. లేకపోతే వాడిని కాస్త శ్రమ పెట్టాలంతే. వాడు ఆణిముత్యం. మీరు వాడి పాట వినాలి, ఒక్క రోజుకు ఆగలేరా''

మూడోరోజు ఉదయమే కిరణ్ వెళ్లిపోయి వుండాల్సింది. అక్కడ నగరంలో తనకెన్నో ప్రోగ్రాములు. తను కలవవలసిన వాళ్లూ, తనను కలిసే వాళ్లూ, క్షణం తీరిక వుండదు. కానీ బుజ్జి పాట మీద ముకుంద్ గ్యారంటీ ఇస్తున్నాడు.

ఉదయం తొమ్మిది గంటల వేళ. కొబ్బరి చెట్ల మీద చిలుకలు పాడుతున్నాయి. మామిడి కొమ్మల్లో దాక్కున్న కోయిలలు కూహురావాలతో దేన్నో ఆహ్వానిస్తున్నాయి. తరగతి గదుల్లోకీ, బైటకీ ఎగురుతూ గొడవ చేస్తూన్న పిచ్చుకలూ, కొబ్బరి చెట్లని పొడుస్తున్న వడ్రంగి పిట్టలూ, ఒకదాన్నొకటి తరుముకుంటున్న గోరెంకలూ, పావురాళ్లూ.. అన్ని సవ్వడులతో ఆ ఉదయం నిండిపోయినా మనసు నిండా గొప్ప ప్రశాంతత. తనకే తెలీని శాంతి. ఒంటరితనంలోని, ఏకాంతంలోని అందం. నిశ్శబ్దంలో శబ్దం. శబ్దంలో నిశ్శబ్దం. కిరణ్‌కు తన పాటేదో ఇంకా అంతుచిక్కలేదు. రాత్రంతా మేలుకుని అన్వేషిస్తూనే వున్నాడు.

పిల్లలు ఒక్కొక్కళ్లే 'గుడ్‌మార్నింగ్' చెప్తూ బడిలోకి వచ్చారు. అసెంబ్లీ హాలులో వలయాకారంగా కూర్చున్నారు. తమ పాటల్ని కనుక్కుని రాసుకొచ్చిన విద్యార్థులు చదివి వినిపించారు.

కిరణ్‌ను ఆయనకే తెలీని ప్రశ్నేదో ఆయన్ను తొలచసాగింది.

''బుజ్జీ! అందరూ తమ పాటల్ని వినిపించారు. ఇక నువ్వే మిగిలింది'' ముకుంద్ బుజ్జిని ఆహ్వానించాడు.

బుజ్జి లేచి నిలబడి ''లేదన్నా! నా పాట నాకు తెలియలా. చాలాసేపు ఆలోచించాను. నాకేం తట్టలేదన్నా. బహుశా నాకు పాట లేదేమోనన్నా''

''పాటలేని వాళ్లెవ్వరూ వుండరు. నువ్వు నీ పాటను తెచ్చేదాకా నేను అన్నం తినను'' విసురుగా వెళ్లిపోయాడు ముకుంద్.

సాయంత్రం వరకూ ముకుంద్ జాడలేదు. కిరణ్‌కు తాను వెళ్లిపోవాలో, వెళ్లగూడదో తెలీలేదు. ఒక పిల్లవాడి నుంచీ ఒక చిన్న పాట రాబట్టటానికి ఎంత గొడవ. ఎంత రాద్ధాంతం. వాడు రాయకపోతే రాయకపోయాడు. మిగిలిన అందరూ ఏదో ఒకటి రాసారు కదా. ఒక్కళ్లో ఇద్దరో బడుద్ధాయిలుంటారు. వాళ్లనేం చెయ్యగలం? వాళ్లను వదిలేసి, చూసీ చూడనట్లు పోవాలి.. పిల్లవాడు పాట రాసుకొస్తాడో రాసుకురాడో.. కిరణ్‌కు కూడా తెలుసుకోవాలనే కుతూహలం పెరిగింది.

చీకటిపడే వేళకు ముకుంద్ కన్పించాడు. కిరణ్‌కు క్షమాపణలు చెప్పుకుని ''వాడు తప్పకుండా తన పాటను తెస్తాడు. ఒక్కోసారి కఠినంగా ప్రవర్తించాల్సి వుంటుంది. తప్పదు. వాడు రాయలేదని వదిలేస్తే, వాడిలోని సృజన అలా తెర మరుగునే ఉండిపోతుంది. ఒక్కోసారి తీవ్రమైన క్షోభకు లోను చెయ్యాల్సివుంటుంది. ఘర్షణలోంచే కదా సృజన జరగాల్సింది. మీరు ఏమనుకోకపోతే రేపటికి మీ ప్రయాణాన్ని వాయిదా వేసుకోకూడదూ. వాడు తన పాటను తెస్తాడు...''

బుజ్జి తెచ్చే పాట మీద ముకుంద్‌కున్న గొప్ప నమ్మకం కిరణ్‌ను కదిలించి వేసింది. ముకుంద్ ఆశించినంత సృజనాత్మకంగా బుజ్జి తన పాటను

తెస్తాడా...

ఆ రాత్రంతా కిరణ్ తన పాట గురించే ఆలోచించాడు. ముకుంద్‌తోనూ, టీచర్లతోనూ, విద్యార్థులతోనూ మాట్లాడుతున్నా మనసులో ఎక్కడో ఏదో వెలితి. అతని మనసు అతనినే నిలదీస్తోంది. అద్దంలోని ప్రతిబింబం అతన్నే ప్రశ్నిస్తోంది.

తెల్లవారటానికి ముందెప్పుడో అతనికి నిద్రపట్టింది. లేచేసరికి చాలా వేళయింది. గబగబా తయారై టిఫిన్ వేళకు డైనింగుహాలు చేరుకున్నాడు కిరణ్. ఉదయం బ్రేక్‌ఫాస్ట్ సమయంలోనూ, మధ్యాహ్నం భోజనాల సమయంలోనూ ముకుంద్ కన్పించలేదు. నిజంగానే నిరాహార దీక్ష చేస్తునట్లున్నాడు. అయినా మామూలుగానే ఆయా క్లాసులకు పాఠాలు చెప్పాడట. ఎవరో అన్నారు, ముకుంద్ అన్నకు కోపం వస్తే చాలా కష్టమని. ఎప్పుడూ ఎవర్నీ తిట్టడు. కొట్టడు. కసురుకోడు. విసుక్కోడు. కోపమే తెచ్చుకోడు. కోపం వస్తే తన్ను తాను శిక్షించుకుంటాడు తప్ప, తప్పు చేసిన వాళ్లను శిక్షించడు.

నిజంగా చాలా ఏంతే! ఇలాంటి టీచర్లు ఎక్కడోగానీ కన్పించరు. బుజ్జి జాడేలేదు.

అసంతృప్తితోటీ, ఏం చెయ్యాలో తోచని విరక్తి తోటీ మళ్లీ గదిలోకి వచ్చి కుర్చీలో కూలబడ్డాడు కిరణ్. కిటికీ లోంచీ బయటి శూన్యంలోకి చూస్తున్నాడు.

తనిన్నాళ్లూ గద్దలా యాంత్రికంగా గిరికీలు కొట్టడంలోనే గడిపివేశాడు. ధనమూ, పలుకుబడీ, అధికారమూ, హోదా... వీటికోసం ఎన్ని పాట్లు పడ్డాడు. ఇన్నాళ్లూ మనసనే దాన్ని దూరంగా తరిమేసి, అనుభూతులకూ అనుభవాలకూ ఆమడ దూరంగా వుంటూ పూర్తిగా సాహిత్య వర్తకుడైపోయాడు. తన చేతిలో భాష వుంది. దానితో ఎన్ని ఆటలు ఆడిస్తున్నాడు. సృజనాత్మకత పేరుతో తనను తాను మోసం చేసుకోవడం కాదా...

తన పాట తప్పిపోయింది. తానే తన పాటను పోగొట్టుకున్నాడు. పాట లేకుండా తానిన్నాళ్లూ పాడుతున్నాడు. చప్పట్లు కొట్టించుకుంటున్నాడు. అవార్డులు అందుకుంటున్నాడు. తనతోపాటు పాఠకులూ, శ్రోతలు కూడా తమ పాటల్ని పోగొట్టుకున్నారా? పాట లేకుండా పాడడం హృదయం లేని మాటల గొడవ మాత్రమే.

ఇక్కడ ఈ మారుమూల పల్లెటూళ్లో, ఈ పల్లె పిల్లల మధ్య ముకుంద్ ఎందుకింత కష్టపడుతున్నాడు. ఒక్క పిల్లవాడిలోని సృజనను వెలికితీసుకు రావటం కోసం ఎంత బాధపడుతున్నాడు. ఎంత టైం వేస్టు చేస్తున్నాడు. ఇదే అతను కనుక సిటీలో వుంటే ఎన్ని డబ్బులు సంపాదించి వుండేవాడు. ఆయన పాట పిల్లలు. తన పాట...

సాయంత్రం చివరి గంట మోగింది. బడి పిల్లలందరూ టీచర్లకు 'బై' చెప్పి హోంవర్క్ పుస్తకాలని మాత్రం తీసుకుని, బిలబిలా బైటకు ఉరుకుతున్నారు.

మెయిన్ గేట్ లోంచీ బుజ్జి నిదానంగా, తల వంచుకుని నడుచుకుంటూ వస్తున్నాడు. వచ్చి సరాసరి అసెంబ్లీహాలు మధ్య నుంచున్నాడు. పిల్లలందరూ వాణ్ణి చూసి నిశ్శబ్దమైపోయారు. వాళ్లు కూడా వచ్చి అసెంబ్లీహాల్లో గుమికూడారు. ఎవరో వెళ్లి ముకుంద్‌కూ, కిరణ్‌కూ బుజ్జి వచ్చి నించున్నాడని కబురందించారు. వాళ్లు ఎట్లా వున్నవాళ్లు అలాగే వచ్చారు. ఇద్దరూ పిల్లల మధ్య చోటు చేసుకుని కూర్చున్నారు. సూది కింద పడ్డా విన్పించేంత నిశ్శబ్దం.

ఎప్పట్నుంచో ఏడ్చినట్లు బుజ్జి ముఖం ఎర్రగా కందిపోయింది. కళ్లు జ్యోతుల్లాగా మండుతు



"పాటేగా నీక్కావలసింది.
పాట కావాలిట పాట. చెప్తా రాసుకో"
చాలా కోపంగా ముకుంద్‌ను చూస్తూ
అరిచాడు బుజ్జి.

న్నాయి. పెదాలు అదురుతున్నాయి. జుట్టు రేగిపోయివుంది. చొక్కాకి బొత్తాలు కూడా పెట్టుకోలేదు. నిన్నటి నుంచీ స్నానం కూడా చేసినట్లు లేదు. అన్నం తిన్నాడో లేదో, నీరసంగా కన్పిస్తున్నాడు.. ముఖంలో కసి, కోపం!

"పాటేగా నీక్కావలసింది. పాట కావాలిట పాట. చెప్తా రాసుకో" చాలా కోపంగా ముకుంద్‌ను చూస్తూ అరిచాడు బుజ్జి. పక్క పిల్లవాడి సంచి లోంచి నోటు పుస్తకమూ, పెన్నూ తీసుకుని బుజ్జి చెప్పే పాట రాసుకోడానికి తయారైనాడు ముకుంద్. నలుగురైదుగురు పిల్లలు కూడా అతని పాటను రాయడానికి సిద్ధమైనారు.

నా పాట పేరు అమ్మ
అమ్మ నా పాట
భూదేవి కొండల్నీ, బండల్నీ
చెట్లనీ, మనుషుల్నీ, జంతువుల్నీ
అన్నింటినీ మోస్తుంది.
భూదేవికెంత సహనమో!
భూదేవికెంత ఓపికో!
భూదేవికెంత ప్రేమో!
ఎప్పుడూ ఎవర్నీ ఏమీ అనదు..
అమ్మకూడా భరిస్తుంది
బాధల్నీ, దుఃఖాల్నీ, కన్నీళ్లనీ
నాన్న తిట్లనీ, దెబ్బల్నీ భరిస్తుంది
ఒక్క నవ్వు మాపై విసిరేసి వెళ్లిపోతుంది
ఎప్పుడూ ఎవర్నీ ఏమీ అనదు
ఆకాశం వర్షించినా
భూమి భరిస్తుంది
ఎండ నిప్పుల్ని కురిపించినా
భూమి భరిస్తుంది

బుజ్జి తడుముకోకుండా ఆవేశంగా, ఉద్రేకంగా, కళ్లలోంచీ, ముక్కుల్లోంచీ నీళ్లు కారిపోతుంటే శ్వాస ఎగపీలుస్తూ, కసికసిగా తన పాటను ఆశువుగా చెప్తున్నాడు. అదో ప్రవాహం. ఆ ప్రవాహాన్ని ఆపటం సాధ్యం కాని విషయం. బుజ్జి పాటను సీరియస్‌గా పుస్తకంలో రాసుకుంటున్నాడు ముకుంద్. కిరణ్ స్థాణువై ముక్కుమీద వేలేసుకుని, గుండె లోతుల్నించీ తన్నుకొస్తున్న ఆ పాటను శ్రద్ధగా వింటున్నాడు. బుజ్జి పాట అమ్మ. అమ్మ బాధామయ జీవితానికి గుర్తు. కన్నీళ్లను తన స్వంతం చేసుకుని పైకి గంభీరంగా కన్పించే విషాదం అమ్మ.

"అమ్మ కూలికెళ్లాలి
డబ్బులు తేవాలి
మాకన్నం చేసిపెట్టాలి
నాన్న చేత తన్నులు కూడా తినాలి
నా పాట అమ్మ"

ఎక్కడా కష్టమే లేకుండా సులువుగా, ధారాళంగా వస్తున్న ఆ కవిత వింటున్న వాళ్ల హృదయాలను తాకింది. అందరి కళ్లూ చెమర్చాయి. అందరూ వాళ్ల వాళ్ల అమ్మల్ని తల్చుకున్నారు.

గంభీరమైన మౌనంలోంచీ శబ్దాలను ఒక్కొక్కటే రాలుస్తూ, శబ్దాల ఉద్రేకం నుంచీ మౌనంలో విశ్రాంతి తీసుకుంటూ, అరగంటపైగా అనుభూతి ప్రపంచపు తలుపులు తట్టి, వెక్కి వెక్కి ఏడుస్తూ అసెంబ్లీ హాలు మధ్య కూలబడిపోయాడు బుజ్జి.

బుజ్జి చెప్పిన చివరి వాక్యాల్ని శ్రద్ధగా రాసేసి, ముకుంద్ మౌనంగా లేచివచ్చి, మోకాళ్లమీద వాలి బుజ్జిని గట్టిగా గుండెలకు హత్తుకున్నాడు. ఆయన కళ్లలోంచీ కన్నీటి ముత్యాలు బుగ్గలపైగా జారిపడుతున్నాయి. చాలాసేపు ఎవరూ ఏమీ మాట్లాడలేకపోయారు. పిల్లలు ఆ మౌనాన్ని భంగపరచకుండా, నిశ్శబ్దంగా ఎవరికివారే లేచి ఇళ్లకు వెళ్లిపోయారు. ఆ అనుభూతిని గుండెల నిండా నింపుకుని.

కిరణ్‌కిదంతా అద్భుతంగా వుంది. దుఃఖం, బాధా లేకపోతే సృజన జరగదేమో. హృదయానికి అవ్యక్తమైన ఏదో గాయం తగిలితేగానీ సృజన చించుకుని రాదేమో. తన్ను తాను శిక్షించుకోకపోతే, మనసంతా విషాదాన్ని నింపుకోకపోతే సృజన సాధ్యం కాదేమో.

ఆ సాయంత్రమంతా గంభీరమైన నిశ్శబ్దంలోనే గడిచిపోయింది. ఎవరికి వారు ఒంటరివాళ్లయినట్లు, ఎవళ్ల మనోలోకాల్ని వాళ్లు తవ్వుకుంటూ వుండిపోయారు. ఆ రాత్రి భోజనాల సమయంలోనూ అఖండమైన మౌనం.. ఆ రాత్రంతా ప్రకృతిని అగాధమైన ధ్యానం ఆక్రమించింది.

తన ఆశలూ, ఆశయాలూ, అసూయలూ, ఈర్ష్యలూ, ద్వేషాలూ, ఆరాటాలూ, తాపత్రయాలూ, స్వార్థపరత్వం, అహం, పదవుల కోసం, పలుకుబడి కోసం ఎలా సంఘర్షించిందీ, ఆ పెనుగులాటలో తన పాటకు తానెలా దూరమైందీ, పాట లేకుండా పాడటం ఎంత అర్థరహితమో.. మొదటి సారిగా కిరణ్ తన పాటను ఆవిష్కరించుకోసాగాడు. ఎవరన్నా విమ



ర్శిస్తారని గానీ, ఏదో అంటారనే భయంగానీ లేకుండా, ఆ అర్థరాత్రి ఆశువుగా అతని పాట కాగితాల్లో పదిలం కాసాగింది. తన మూలాల్ని అన్వేషించుకుంటూ సాగిన వ్యక్తీకరణ. కవిత్వంలో నాన్ని, వాస్తవాలపై నడిపించి, అంతర్ముఖుడైన వేళ, మొట్టమొదటి సారిగా విచ్చుకున్న హృదయ గీతం.

మర్నాడుదయం ఇంకా చీకట్లు విచ్చుకోకుండానే అతనికి మెలకువ వచ్చింది. శరీరాన్నీ, మనసునూ ఏదో అనిర్వచనీయమైన ధ్యానస్థితి ఆవరించినట్లయింది. మనసు నిండా గొప్ప ప్రశాంతత. వర్ణించలేని ఆనందం. దేన్నించో విడుదలైనట్లు. స్వేచ్ఛ.. అవును గొప్ప స్వేచ్ఛ.. ఇప్పుడు ఈ స్వేచ్ఛనూ, శాంతినీ ఏ రాగద్వేషాలూ ఆక్రమించుకోలేవు.

మర్నాడు ఉదయం స్కూలు అసెంబ్లీలోకి కిరణ్ అడుగుపెట్టేసరికి అతని ముఖంలో ఏదో కళ, జీవం, ఆనందం తాండవిస్తున్నట్లుంది.

''నిన్నటి వరకూ మీరందరూ మీ పాటలు విన్పించారు. ఇప్పుడు నా పాట వినండి..'' అంటూ తన పాటను గానం చేశాడు. ''నా 'నేను' ఆవిష్కరించిన నేచురల్ స్కూలు పిల్లలకు అంకితం'' అనంటూ కృతజ్ఞతలు నిండిన కంఠంతో, తడి నిండిన కళ్లతో పిల్లలకు నమస్కారం చేసాడు కిరణ్.

## మహిమా వైరాగ్యం

లియాండర్ పేస్ గురించి ఎందరు ఎన్ని విధాల హెచ్చరించినా మహిమా చౌదరి వినలేదు. తీరా ఇద్దరి మధ్య చెడిన తరువాత లియాండర్‌ని శాపనార్థాలు పెడుతోంది. కనిపించినవారికల్లా మగాళ్లని నమ్మవద్దని హితబోధ చేస్తోంది. అసలు గొడవంతా సంజయ్‌దత్ మాజీ భార్య రియాదత్‌తో వచ్చింది. రియాతో పేస్ చనువు ఎక్కువైనా మహిమా అనుమానించలేదు. ఎందుకంటే రియా వయసు 40 ఏళ్లు. అయితే తన చెల్లి బర్త్‌డేకి తనింటికే వచ్చి, తన కళ్లఎదుటే వాళ్లిద్దరూ ఒకటే రాసుకు పూసుకు తిరుగుతుంటే మటుకు అనుమానమొచ్చింది. ఒక గేమ్‌కి తనని కాకుండా రియాని ఎప్పుడైతే పేస్ తీసుకెళ్ళాడో అప్పుడే అతనితో కట్ చేసుకుంది. ఆ తరువాత అంతా పత్రికల్లో వచ్చింది. పేస్‌ని కొంగుకి కట్టేసుకునే మహిమలేమీ మహిమ దగ్గర లేకుండా పోయాయి మరి!

